ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి

ఉపాధ్యాయ పోస్టులు.. 95 శాతం స్థానికులకే!

● రెండోరోజు కొనసాగిన ధ్రువీకరణపత్రాల పరిశీలన


ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ రాజీవ్, డీఈవో రాజేందర్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో రోజు గురువారం కొనసాగింది. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. ములుగు, భూపాలపల్లి జిల్లాల పరిశీలకులు, ఆర్‌జేడీ రాజీవ్‌తో పాటు డీఈవో రాజేందర్ భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో పరిశీలించారు. నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 5వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆర్‌జేడీ సూచించారు. ఎంపికైన అర్హులకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ఆయా జిల్లాలకు చెందిన స్థానిక అభ్యర్థులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం ఖాళీల్లో 95 శాతం స్థానికులతో భర్తీ చేయనున్నారు. మిగతా 5 శాతం ఖాళీలను ఓపెన్ విభాగంలో భర్తీ చేస్తారు. ఖాళీల్లో స్థానిక అభ్యర్థులతో పాటు స్థానికేతరులను మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. జయశంకర్ జిల్లాలో 237 ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం సుమారు 711 మంది అభ్యర్థులను 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసి, ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు.


మెరిట్ ఆధారంగానే..

అభ్యర్థులు సాధించిన మెరిట్‌తో పాటు రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాత పరీక్ష 80 శాతం, టెట్ 20 శాతం మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. వ్యాయామ ఉపాధ్యాయులకు మాత్రం వంద శాతం మార్కులను రాత పరీక్ష ఆధారంగా పరిగణలోకి తీసుకుంటారు. ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగా రోస్టర్ పాయింట్లను నిర్ణయించనున్నారు. ఒకే అభ్యర్థి ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైతే వారి నుంచి ఆసక్తి ఉన్న పోస్టును ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించి రాతపూర్వకంగా లేఖ తీసుకుంటారు. అభ్యర్థి ఎంపిక చేసుకున్న పోస్టును మినహాయించి ఆ అభ్యర్థి ఎంపికైన ఇతర విభాగాల పోస్టుల నుంచి పేరు తొలగించనున్నారు. ఈ విధానం అమలు చేయడం వల్ల ఖాళీలు మిగిలిపోయే అవకాశం లేదు. తర్వాత ఉన్న మెరిట్ అభ్యర్థులతో ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయనున్నారు.

☛ అభ్యర్థులు సాధించిన మెరిట్‌తో పాటు రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని ఎంపికైన తుది అభ్యర్థుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రకటించనున్నారు. అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 9 నియామకపత్రాలు అందజేయనున్నారు.

☛ జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల వివరాలను నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచుతారు. పాఠశాలలు, సబ్జెక్టులు, మాధ్యమం వారీగా ఖాళీలను ప్రకటిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలలను కేటాయించే సమయంలో అభ్యర్థి సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించి, కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక చేసుకున్న పాఠశాలల్లో వారికి నియామక పత్రాలు అందజేస్తారు. బాలికల పాఠశాలల్లో మహిళా అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పుడు వారితోనే భర్తీ చేయాలన్న నిబంధన పెట్టారు. దసరా సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

శైలపుత్రిగా అమ్మవారు



కాళేశ్వర క్షేత్రంలోని అనుబంధ ఆలయాల్లో వెలసిన శుభానంద, సరస్వతీ దేవీలు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కాగా అర్చకులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించగా మొదటి రోజు ఇరు దేవతామూర్తులు శైలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు శుభానందదేవీకి స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు. భద్రత దృష్ట్యా కాటారం బ్యాంకులో భద్రపర్చిన కిరీటాన్ని ఈవో మారుతి తీసుకురాగా విశేష పూజల నడుమ అలంకరించారు. కార్యక్రమంలో కొడవటంచ ఈవో మహేశ్, మాజీ సర్పంచి మాధవి, మాజీ ఆలయ ధర్మకర్త అశోక్, నాయకులు పాల్గొన్నారు

– న్యూస్‌టుడే, కాళేశ్వరం



సింగరేణి క్రీడాకారులకు సన్మానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఇటీవల ఒడిశాలోని ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం స్థానిక జీఎం కార్యాలయంలో జీఎం హబీబ్ హుస్సేన్ ఘనంగా సత్కరించారు. సన్మానం పొందిన వారిలో క్రీడాకారులు శ్రీనివాస్‌రెడ్డి, యాసిస్ బేగ్, శ్వేత, శ్రీలేఖ్య, అనూష తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో అధికారులు మారుతి, రాజు, కార్మిక సంఘాల నాయకులు రమేష్, బుచ్చయ్య, సీనియర్ పర్సనల్ మేనేజర్ క్రీడల అధికారులు శ్రావణ్‌కుమార్, పర్శ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ తిరుమల్ పాల్గొన్నారు.

సంఘటితం.. ప్రగతిపథం


కొత్త సభ్యుల చేరికపై ఆర్పీల సమావేశం

న్యూస్‌టుడే, భూపాలపల్లి

జిల్లాలో ఏకైక భూపాలపల్లి పురపాలక సంఘంలో కొత్తగా స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేస్తుండగా మంచి స్పందన వస్తోంది. సంఘాల్లో సభ్యులుగా చేరితే కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులు చక్కబెట్టుకోవచ్చని భావిస్తున్నారు. మెప్మాకు చెందిన రిసోర్సుపర్సన్లు కొత్తగా చేరనున్న మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు గలవారిని సభ్యులుగా చేర్పిస్తున్నారు. ప్రతి నెలా కొంత డబ్బు పొదుపు చేసేందుకు సిద్ధమై సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా ఏర్పడిన సంఘాలు నాలుగు నెలల పాటు పొదుపు కొనసాగిస్తే బ్యాంకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తూ వివిధ యూనిట్లు నెలకొల్పేలా మెప్మా సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు.

రూ.20 లక్షల వరకు రుణాలు : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆర్పీలు 30 మంది ఉన్నారు. వీరు పురపాలికలో వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి కొత్తవారు స్వయం సహాయక సంఘాల్లో చేరితే వచ్చే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన తొలుత పది మంది సభ్యులకు ఎస్‌హెచ్‌జీ ద్వారా రూ.75 వేలు బ్యాంకు లింకేజీతో రుణం ఇప్పించే అవకాశం ఉంటుంది. ఇలా దశలవారీగా రూ.20 లక్షల వరకు రుణంగా అందిస్తున్నారు. ప్రతి సభ్యురాలు రూ.335 పీఎంఎస్‌బీవై పథకానికి, రూ.12 పీఎంఎస్‌వై పథకానికి చెల్లించడం ద్వారా సభ్యులు ప్రమాద బీమా, సాధారణ మరణానికి ఆర్థిక సహాయం పొందవచ్చని చైతన్యపరుస్తున్నారు. కొత్తగా చేరిన సభ్యులు బ్యాంకులో పొదుపు చేయడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పురపాలక సంఘంలో 715 వరకు స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో సభ్యులు 7,150 మంది వరకు ఉన్నారు.

పథకాలపై చైతన్యపరుస్తూ : సంఘాల్లో చేరిన మహిళలకు మహిళా శక్తి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన కలిగిస్తున్నారు. సంఘాల్లో సభ్యులుగా ఉండి చనిపోయినవారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు. పెళ్లిళ్లు అయ్యాక అత్తగారింటికి వెళ్లేవారు ఆ ఊరిలో ఖాళీ ఏర్పడిన వారి స్థానంలో కొత్తవారిని చేరుస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన వారిని తొలగిస్తూ కొత్తవారికి అవకాశం ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- రాజేశ్వరి, మెప్మా డీఎంసీ

కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు జరుగుతున్నందున ఆసక్తి ఉన్న మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా మున్సిపాలిటీ పరిధిలో 10 సంఘాలకు పైగా పెంచుతాం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందడానికి ఇది చక్కటి అవకాశం. అదేవిధంగా చిరు వ్యాపారాలు చేసుకునే వారు సంఘాల్లో సభ్యులుగా చేరితే, వారికి బ్యాంకు రుణాలు ఎంతో ఉపయోగపడుతాయి.

పైసలు లేవు.. పండగ ఏర్పాట్లు ఎలా?

● గ్రామాలకు అందని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఈనాడు, వరంగల్

బతుకమ్మ, దసరా రాష్ట్రంలో పెద్ద పండగలు. ప్రజలంతా ఒక్కచోట చేరి చేసుకునే వేడుకలు. ఈసారి పల్లెల్లో పండగ ఏర్పాట్లు ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు.



ఇదీ పరిస్థితి..

హనుమకొండ జిల్లా దామెర మండలం పంచాయతీ కార్యదర్శులు గత నెల 20న మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం ఇస్తున్నారు. గ్రామాల్లో తీవ్ర నిధుల కొరత ఉందని, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్లు మోయలేని భారంగా మారాయని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పరిస్థితే నెలకొంది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని చెరువు. సద్దుల బతుకమ్మ వేడుకలను ఇక్కడే నిర్వహిస్తారు. మరో రెండు మూడు రోజుల్లో చెరువు కట్ట మీద పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది.

● ఈ ఆర్థిక సంక్షోభం సమయంలో ఈసారి బతుకమ్మ, దసరా పండగలకు చెరువు కట్టల వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు, కట్టలపై జంగిల్ కట్టింగ్, డీజే సౌండ్ ఏర్పాటు లాంటివి ఏర్పాటుచేసేందుకు తమ వద్ద డబ్బులు లేవని కార్యదర్శులు ఉన్నతాధికారులకు వినతులు ఇస్తూ నిధుల కోసం వేడుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌లో వందలాది గ్రామాల్లో ఏర్పాట్లు ఎలా చేసేది అంటూ కార్యదర్శులు దిగులు చెందుతున్నారు.

ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రం నెలనెలా అందివ్వాల్సిన ఆర్థిక సంఘం డబ్బులు ఎన్నో నెలల తరబడి గ్రామాలకు అందడం లేదు. దీంతో ఇప్పటికే మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధి దీపాల మరమ్మతుల కోసం తాము అప్పులు చేసి గ్రామ పాలన నడిపిస్తున్నామని కార్యదర్శులు చెబుతున్నారు.

● ములుగు 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.5.59 కోట్ల బకాయిలు గ్రామాలకు రావాల్సి ఉంది. ఈసారి బకాయిలు మూడు రెట్లకన్నా ఎక్కువగా పేరుకుపోవడంతో అనేక ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ గ్రామం. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో డోజర్లు లేదా ట్రాక్టర్లతో మొక్కలను తొలగించాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పంచాయతీలోని మల్టీ పర్పస్ కార్మికులే చేతితో మొక్కలు పీకేస్తున్నారు. ఇలా అనేక పంచాయతీలకు అందాల్సిన నిధులు రాక పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నింటికీ ఉద్దరే..

మేజర్ పంచాయతీలకు అంగడి ద్వారా ఆదాయం రావడంతో వారు వివిధ రకాల ఖర్చులకు సర్దుబాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేసి మరీ అవసరాలు తీరుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు దుకాణాల్లో ఉద్దెర తెస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటుచేసినప్పుడు టెంట్ హౌజ్‌లు, ఎలక్ట్రిక్ బల్బులతోపాటు చిన్న చిన్న వస్తువులన్నీ సగం చెల్లించి మిగతాది ఉద్దెరగా తెస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో బ్లీచింగ్ పౌడి కొనేందుకు, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేసేందుకు డబ్బులు లేవని ఇప్పుడు పైసలు లేకుండా పండగలు చేయడం తలకు మించిన భారం అవుతుందని కాబట్టి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధి తక్కువే

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్లను జీవో ద్వారా విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో ఏర్పాట్లకు కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేలు అంతకన్నా ఎక్కువే వెచ్చించాలి. ఈ నిధులు పంచితే దేనికీ సరిపోవని కార్యదర్శులు వాపోతున్నారు.

జిల్లాల వారీగా పంచాయతీలకు రావాల్సిన బకాయిలు

● జిల్లా	● గత ఆరు నెలలుగా రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో)	● పంచాయతీలు
ములుగు	18.85	208
హనుమకొండ	24.40	208
వరంగల్	27.95	325
జనగామ	24.76	283
మహబూబాబాద్	16.21	461
భూపాలపల్లి	18.22	240

ప్రమాదపుటంచున ప్రయాణం



మండల కేంద్రం నుంచి పంకెన వెళ్లే రహదారిలో తీగల వాగు వంతెన వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు తారు కొట్టుకుపోయి భారీ గుంత ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వాహనాలు ఎదురైనప్పుడు వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాహనదారులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

పొరపాట్లకు తావులేకుండా సర్వే


బుర్రకాయల గూడెంలో సర్వేను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం, న్యూస్‌టుడే : డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం గణపురం మండలం బుర్రకాయలగూడెంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలోని 22వ వార్డు, గణపురం మండలంలోని బుర్రకాయలగూడెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామన్నారు. సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఆర్డీవో మంగిలాల్‌ను నియమించామని చెప్పారు. నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని, అవసరం మేరకు అదనంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇంటింటి సర్వేలో కుటుంబం సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. కుటుంబ గుర్తింపునకు మాత్రమే సర్వే నిర్వహిస్తున్నామని.. ఒక రాష్ట్రం, ఒక కార్డు ద్వారా ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డును అందించనున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల అనుమతితో వారిని ఫొటో తీయాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఐదు రోజుల్లో కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మంగిలాల్, గణపురం ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి వ్యాఖ్యలు గర్హనీయం'


మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : 'ఉన్నత స్థానాల్లో ఉన్నవారు ఎవరైనా ఆదర్శంగా మాట్లాడాలి.. కానీ, ఒక మహిళా మంత్రి కొండా సురేఖ సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం సరైంది కాదని, మాజీ మంత్రి కేటీఆర్‌పై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని.. వెంటనే క్షమాపణ చెప్పాలని' భారాస జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక భారాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న కొండా సురేఖ మెడలో ఓ ఎమ్మెల్యే దండ వేయడంతో కొంతమంది ఆ విషయాన్ని ట్రోల్ చేస్తే, దానికి కేటీఆర్ కారణమని మంత్రి ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రస్తుతం ఏం చేయాలనేది తెలియక.. హైడ్రా పేరుతో నిరుపేదల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని విమర్శించారు. భారాస ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశామని, బాలికలకు వసతి గృహాలు నిర్మించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, అర్బన్ కమిటీ అధ్యక్షుడు కట్కం జనార్దన్, వార్డు కౌన్సిలర్లు నూనే రాజు, మురళీధర్, రఘుపతిరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి


లక్ష్మీనగర్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కాకతీయకాలనీ, ఎల్బీనగర్, శాంతినగర్ హన్మాన్‌నగర్, లక్ష్మీనగర్, బానోతు వీధిలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.76 కోట్లతో పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం అత్యధికంగా నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. శక్తి వంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, తదితర అభివృద్ధి పనులను గుత్తేదారులు నాణ్యతగా, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కమిషనర్ రాజేశ్వర్, ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకల్లో : పట్టణంలోని బానోతు వీధి, హన్మాన్‌నగర్, మండలంలోని గొల్లబుద్దారంలో గురువారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే జీఎస్సార్ పాల్గొన్నారు. తీజ్ వేడుకలను ఏటా గిరిజన యువతులు ఎంతో నిష్ఠతో, ఉపవాస దీక్షతో గోధుమ విత్తనాలు బుట్టలో పెంచుతారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. గిరిజన మహిళలు, యువతుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో గిరిజనులు సత్కరించారు. పలువురు గిరిజన ఉద్యోగులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అందరం ఒకటిగా.. ర్యాగింగ్‌కు దూరంగా



ఇంజినీరింగ్, ఫార్మసి తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నీట్ కౌన్సెలింగ్ ముగించుకొని త్వరలో వైద్య విద్యార్థులు కళాశాలలకు రానున్నారు. కొత్త కళాశాలలు.. కొత్త వాతావరణం.. దీనికి తోడు ర్యాగింగ్ భయం. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని బయటకొచ్చిన విద్యార్థులకు ఇక్కడ కాస్త బెరుకుగానే ఉంటుంది. సీనియర్ల శ్రుతి మించిన చేష్టలు వారిని ఆందోళనకు గురిచేస్తుంటాయి. ఈ భయం పోగొట్టడానికి కళాశాలల్లో యాజమాన్యాలు, అధ్యాపకులు కృషి చేయాలి..

–న్యూస్‌టుడే, విద్యానగర్, హసన్‌పర్తి

● 2021 సెప్టెంబర్.. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఉత్తరాదికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తకు చెందిన విద్యార్థిని ర్యాగింగ్ చేయడం సంచలనం సృష్టించింది. కేంద్రస్థాయిలో ఒత్తిడి రావడంతో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

● గతేడాది రాజస్థాన్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని ర్యాగింగ్ చేసిన ఏడుగురు విద్యార్థులపై మట్టెవాడ పోలీసులు కేసులు నమోదు చేశారు.



కేయూలో యాంటీ ర్యాగింగ్ గోడపత్రిక విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, అధ్యాపకులు

పకడ్బందీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు..

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయం, భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2009లో యాంటి ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏటా బీటెక్, ఫార్మసీ, ఎంబీఏ, అగ్రికల్చర్ బీఎస్సీలో చేరుతున్న విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య తలెత్తకుండా విశ్వవిద్యాలయం అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తికాగానే యాంటి ర్యాగింగ్‌పై సదస్సులు ఏర్పాటు చేసి, పోలీసు అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు శాఖ చర్యలు, చట్టాల గురించి వివరిస్తున్నారు. దీనికి తోడు క్రమశిక్షణ కమిటీలను ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. ర్యాగింగ్ రహిత విశ్వ విద్యాలయాలుగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

ఈ విషయంలో జాగ్రత్త..

- ఇతర విద్యార్థుల పట్ల అమానుషంగా, కఠినంగా వ్యవహరించడం
- మొబైల్ ఫోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం
- శారీరకంగా, మానసికంగా వేధించడం
- సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా ప్రవర్తించడం

ఏం చేయాలంటే..

ర్యాగింగ్ నిరోధానికి ప్రభుత్వం 1997లో చట్టం తీసుకొచ్చింది

- ప్రతి విద్యాసంస్థలో అనుభవం ఉన్న ప్రొఫెసర్, స్థానిక పోలీసు అధికారి భాగస్వామ్యంతో కమిటీలను ఏర్పాటు చేయాలి.
- చట్టాలను అతిక్రమిస్తే విధించే శిక్షలు తెలిపే బోర్డులను ప్రతి విద్యాలయంలో అందరికీ కనిపించే ప్రదేశాల్లో ఉంచాలి.

కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక గోడ పత్రాలు ప్రదర్శిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు (ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు)

ఇంజినీరింగ్ కళాశాలలు	7
పీజీ	72
ఫార్మసీ	37
డిగ్రీ	262
ఎంబీఏ, ఎంసీఏ	30
గురుకుల డిగ్రీ	30
బి.ఎడ్	41
న్యాయ	4

అతిక్రమిస్తే శిక్షలు తప్పవు..

- రూ.2.50 లక్షల వరకు జరిమానా.
- సదరు విద్యార్థి ప్రవేశం రద్దు చేసి, కళాశాల నుంచి బహిష్కరణ.
- మరే ఇతర కాలేజీలో చేరే అవకాశం లేకుండా చేయటం.
- పోలీసు కేసు నమోదు..


డయల్ 100కు కాల్ చేయండి..: - ఎస్‌కె. సలీమా, సెంట్రల్ జోన్ డీసీపీ

విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలి. 5 నిమిషాల్లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం మీ ముందు ఉంటుంది. విద్యార్థినులకు రక్షణగా షీ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువును కొనసాగించాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.



ఎస్సార్ విశ్వ విద్యాలయంలో జరిగిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

పరిచయ కార్యక్రమాలతో ప్రోత్సాహం



- ప్రవళిక, ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధ్యాపకుల సహకారంతో మొదటి సంవత్సరం విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీనిద్వారా కొత్తవారికి భయం పోతుంది. వారిని సహ సంబంధ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తాం. కలివిడిగా ఉండడం ద్వారా సీనియర్, జూనియర్ అనే తేడా ఉండదు.

భయం పోయింది..



- యాకేష్, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం, కోఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్

ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ అంటే కొంత భయంగా ఉండేది. సీనియర్లు మమ్మల్ని ప్రోత్సహించే విధంగా ఉండాలి. అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బిడియం, భయం పోయాయి. సందేహాల నివృత్తికి సీనియర్, జూనియర్ విద్యార్థుల భాగస్వామ్యం అవసరం.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



బాలాత్రిపుర సుందరిగా భద్రకాళి



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు బాలా త్రిపురసుందరీగా శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవానుజ్ఞ ప్రార్థన, గణపతి పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలను భద్రకాళి అమ్మవారికి అలంకరించారు. ఉదయం వృషభ వాహన సేవ, సాయంత్రం మృగ వాహన సేవలు జరిగాయి. భవానీ దీక్షాధారులు, భక్తులు, మహిళలతో దేవాలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం, రాత్రి మహా అన్నదానం చేశారు.

● రెండోరోజు శుక్రవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణ మాతగా అలంకరిస్తారని, ఉదయం బ్రహ్మచారిణి దుర్గార్చన, 11 గంటలకు మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలుంటాయని ఈవో శేషుభారతి తెలిపారు.

తొర్రూరులో 'కాసం ఫ్యాషన్స్' ప్రారంభం

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్స్' మాల్ 13వ స్టోర్‌ను గురువారం సినీనటి ప్రియాంక మోహన్ ప్రారంభించారు. మొదట జ్యోతి వెలిగించి మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ దుస్తులను పరిశీలిస్తూ సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన అధునాతన వస్త్రాలను సరసమైన ధరలకే అందించడానికి కాసం సెలక్షన్స్ నూతన స్టోర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్‌లు కాసం ఓంనమఃశివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాదులు మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా, దీపావళి సందర్భంగా నూతన స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. సినీనటి ప్రియాంకమోహన్‌ను చూడటానికి యువత పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నిర్వాహకులు కాసం ఫణి, సాయికృష్ణ, ధీరజ్, ప్రీతమ్, ప్రవీణ్, పల్లూరి అరుణ్‌కుమార్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి ప్రియాంక మోహన్, నిర్వాహకులు

● సినీనటి ప్రియాంకమోహన్‌తోపాటు కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాల్ ముందు ఏర్పాటు చేసిన స్టేజిని ఎక్కుతున్న తరుణంలో అది ఒక్కసారిగా కూలిపోయింది. ఝాన్సీరెడ్డికి గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించారు.

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్ రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	112
రిటైల్:	134
డ్రెస్డ్:	194
స్కిన్‌లెస్:	221

అడవిని చూసొద్దాం.. వన్యప్రాణులను కాపాడుదాం

ఏటూరునాగారం అభయారణ్యంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు ఇటీవల చిక్కిన వన్యప్రాణులు..

















రోజురోజుకు వన్యప్రాణులు అంతరించిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నా వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతంలో అనేక అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి.. మనకు విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ అందాలను వీక్షిస్తూనే అందులో నివసిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది.. శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ఏటూరునాగారం, న్యూస్‌టుడే

● ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 6.26 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.

సంరక్షణ చర్యలు ఇలా..

ఏటూరునాగారం అభయారణ్యం మొత్తం 806 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 146 గ్రామాలతో, ఏటూరునాగారం నాలుగు రేంజి కార్యాలయాలతో విస్తరించి ఉంటుంది. ఇందులోని వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. సాసర్ పిట్లు, నీటి తొట్టెలలో ప్రతి రోజూ నీటిని పోయడం, నిర్మానుష్య ప్రదేశాలలో అడవి జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఉప్పు గడ్డలు వేయడం, పచ్చిగడ్డిని నీటి తొట్లు, సాసర్‌పిట్లు ఉన్న చోట వేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అటవీ అధికారులు ఎవరి బీట్ పరిధిలో వారు నిత్యం క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ అడవులో వేటగాళ్లు విద్యుత్తు తీగలు అమర్చారా, ఉచ్చులు అమర్చారా అని పర్యవేక్షిస్తుంటారు. అడవి జంతువులు ఆనవాళ్లు ఎక్కడ ఉన్నాయి, ఉన్నాయా? లేవా అని తెలుసుకునేందుకు అవి సంచరించే నిర్జన ప్రదేశాల్లో కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా అడవిలో నీటి వనరులున్న చోట కెమెరా ట్రాప్‌లు, ఉప్పు గడ్డల వంటివి ఏర్పాటు చేసి వాటి ఆనవాళ్లు సేకరిస్తారు.



ఏటూరునాగారం సబ్ డివిజన్‌లోని అడవి విస్తీర్ణం తెలిపే మ్యాపు

● ములుగు జిల్లాలో 7,27,821 ఎకరాల్లో అడవులు ఉన్నాయి. ములుగు, తాడ్వాయి, వెంకటాపురం, ఏటూరునాగారం సబ్ డివిజన్లతో 13 అటవీ రేంజి కార్యాలయాలతో 77 బ్లాకులతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పని చేస్తోంది. ఇందులో 806.15 చదరపు కిలో మీటర్ల పరిధిలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం విస్తరించి ఉంది.

చట్టం ఏం చెబుతుందంటే..

వన్యప్రాణులను వేటాడటం నిషేధమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 చెబుతోంది. అభయారణ్యంలో వేటగాళ్లు నిత్యం అడవి జంతువుల పాలిట మరణమృదంగాన్ని మోగిస్తూనే ఉన్నారు. వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్తు తీగలు వన్యప్రాణుల ప్రాణాలు ఏదో ఒక ప్రాంతంలో కబలిస్తూనే ఉన్నాయి.

● వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం అటవీ జంతువులను వేటాడినట్లు రుజువైతే మూబడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తారు. ఏ ఒక్కరికీ ఈ శిక్షలు పడిన దాఖలాలు లేవు.

వారోత్సవాలకు శ్రీకారం..



వన్యప్రాణుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్), జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడిగా కృషి చేస్తున్నామని విశ్రాంత జిల్లా అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం అన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈ సంస్థలు వన్యప్రాణులు అంతరించిపోకుండా సంరక్షణకు నడుం బిగించాయి. ఈ నెల 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆరుబయట ఆసుపత్రి వ్యర్థాలు



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో..

నగరంలో ఆసుపత్రి వ్యర్థాలు యథేచ్ఛగా ఆరుబయట పడేస్తున్నారు. 'బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్'కు తరలించాల్సిన వాటిని వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో కుప్పలుగా పోశారు. ప్రతి ఆసుపత్రిలోని వ్యర్థాలను 'బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్'కు అప్పగించాల్సి ఉంటుంది. నేత్ర వైద్యశాలలో అలా చేయకుండా ఆసుపత్రి ఆవరణలో పడేయడంతో కుక్కలు, పందులు వాటిని చిందరవందర చేస్తున్నాయి. దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



నీటిలో పచ్చని ప్రతిబింబం..!

మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కంబాలపల్లి చెరువు చుట్టూ ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జలకళ సంతరించుకొంది. జలాశయం చుట్టూ ఉన్న పచ్చని చెట్లతోనిండిన గుట్ట ప్రతిబింబం చెరువులో పచ్చందాలు పరిచినట్లు కనిపిస్తూ చూపరులను ఆకట్టుకొంటోంది. –న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీశాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, విడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు. సీపీ మాట్లాడుతూ.. నేరాలు కొత్తకొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలంటే.. విచారణ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అదనపు డీసీపీ రవి, జోనల్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



పోలీసు డ్యూటీ మీట్‌లో అధికారుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంత్రి సీతక్క మది దోచిన 'ఈనాడు' చిత్రం

ప్రకృతి పర్యాటకానికి ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లాలోని అడవుల అందాలను 'అచ్చంగా అమెజాన్ అడవిలా.. కొండ్రేడు అందాలిలా.. అనే శీర్షికతో గురువారం ఈనాడు ప్రధాన పత్రిక మొదటి పేజీలో ప్రచురితమైన చిత్ర కథనం మంత్రి సీతక్కను అమితంగా ఆకర్షించింది. ప్రకృతి రమణీయ చిత్రాన్ని 'ఈనాడు' రాష్ట్రానికి తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో గురువారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనాడు చిత్ర కథనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

–మంగపేట, న్యూస్‌టుడే

భారీగా గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీధర్ వ్యాన్‌లో గుట్కా తీసుకొని వరంగల్‌లోని పాన్ దుకాణానికి సరఫరా చేసేందుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఉంచారు. గురువారం ఎనుమాముల ఠాణా పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో వివిధ కంపెనీలకు చెందిన రూ.8.91లక్షల విలువ చేసే గుట్కా లభించింది. వ్యాన్‌ను సీజ్ చేసి, పాన్ దుకాణం యజమాని కృష్ణతో పాటు సరఫరా చేస్తున్న శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు, విచారణ కోసం ఎనుమాముల పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



గుట్కాను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బామ్మ బంగారం.. దొరికిందోచ్!



కొంతమందికి పట్టిందల్లా బంగారం అవుతుందని అంటారు.. నిజమే..! తెలియకుండానే ఓ వ్యక్తి బియ్యం పట్టుకుంటే బంగారం అయ్యింది.. అది ఎంతోసేపు నిలవలేదు. చివరికి వచ్చిన చోటుకే చేరి కథ సుఖాంతమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కట్ల సోమలక్ష్మి అనే వృద్ధురాలు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ బియ్యం సంచిలో ఐదు తులాల బంగారం దాచి పెట్టింది. గ్రామంలో ఓ వ్యక్తికి మంగళవారం సాయంత్రం ఆ బియ్యం సంచి విక్రయించింది. బంగారం దాచుకున్న సంచి వేరే ఉందని భావించింది. అయితే ఆ సంచిని తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. బంగారం దాచిన బియ్యం సంచినే విక్రయించినట్లు గుర్తించి లబోదిబోమంటూ విషయం కుటుంబసభ్యులకు వివరించింది. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి మరుసటి రోజు మళ్లీ అదే గ్రామానికి రాగా అతన్ని పట్టుకొని విషయం చెప్పగా.. గ్రామంలోని ఓచోట 15 బస్తాల వరకు బియ్యాన్ని నిల్వ చేసినట్లు చెప్పాడు. కుటుంబసభ్యుల సాయంతో బియ్యం సంచులను విప్పి వెతకగా బంగారం దొరికింది. దీంతో వృద్ధురాలు సోమలక్ష్మితో పాటుగా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్



ఆలోచన అదిరె.. మర్కటం బెదిరె

చేతికందే పత్తి పంటలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. చెట్లను ధ్వంసం చేస్తూ పిందెలు, కాయలను తినేస్తున్నాయి. దీంతో కోతుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచన చేశారు దుబ్బపేట గ్రామానికి చెందిన కౌలు రైతు తిరుపతి. సాగు చేసిన రెండెకరాల పంట చుట్టూ ఆరడుగుల ఎత్తులో వల బిగించారు. దీంతో కోతులు బెదిరిపోతూ అటువైపు రావడంలేదని రైతు తెలిపారు.

– న్యూస్‌టుడే, మల్హర్(భూపాలపల్లి జిల్లా)

కొత్త మండలం.. సమస్యలు పదిలం

న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా) : నూతనంగా ఏర్పాటైన పలిమెల మండలంలో పలు శాఖలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మండలంలో మొత్తం ఎనిమిది పంచాయతీలు ఉండగా అందులో పంకెన, సర్వాయిపేట, నీలంపల్లి, ముకునూరు, గ్రామాల్లోనే సొంత భవనాలు ఉన్నాయి. పలిమెల, లెంకలగడ్డ, దమ్మూరు గ్రామాలకు లేవు. ఉపాధి హామీ పథకంలో కొత్త భవనాలు మంజూరు కాగా, మోదేడు గ్రామంలో నిర్మించారు. పలిమెలలో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. దమ్మూరు, లెంకలగడ్డ గ్రామాలకు భవనాలు మంజూరు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్నెల్ల క్రితం దమ్మూరులో భవన నిర్మాణం చేపట్టి మధ్యలోనే వదిలేశారు.



ఒకే భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు

ఒకే భవనంలో రెండు అంగన్‌వాడీలు : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం.. అయితే సొంత భవనాల్లేక చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పలిమెల మండల వ్యాప్తంగా మొత్తం 19 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పలిమెలలో మూడు కేంద్రాలు నడుస్తున్నాయి. ఒకటో కేంద్రానికి మాత్రమే సొంత భవనం ఉంది. రెండో కేంద్రం అద్దె గదిలో, మూడో కేంద్రాన్ని భవనాల కొరతతో ఒకటో సెంటర్‌లోనే కొనసాగిస్తున్నారు. ఒకే భవనంలో రెండు అంగన్‌వాడీలు కొనసాగుతుండటంతో పిల్లలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలిమెల, కామన్‌పల్లి అంగన్ వాడీ కేంద్రాలకు నీతి ఆయోగ్ ద్వారా భవనాలు మంజూరయ్యాయి. కానీ పనుల్లో పురోగతి లేదు.



దమ్మూరులో అసంపూర్తిగా భవనం

బడిలో ఆరోగ్య ఉపకేంద్రం

అంబపటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పలిమెల మండలంలో పంకెన, పలిమెల, నీలంపల్లిలో ఆరోగ్య ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. పంకెనలో ఉన్న కేంద్రానికి సొంత భవనం ఉండగా పలిమెల కేంద్రం ప్రభుత్వ పాఠశాలలో, నీలంపల్లి కేంద్రం పంచాయతీ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించాలని ఆందోళన

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో సీట్లు పెంచి పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించాలని గురువారం విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. కేయూ ప్రాంగణంలోని సెల్‌టవర్‌ను ఎక్కి నిరసన తెలపగా ఎస్ఐ రాజ్‌కుమార్ వారికి నచ్చజెప్పి కిందకు దించారు. మరికొందరు రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పురుగు మందు తాగే యత్నం చేశారు. వారిని రిజిస్ట్రార్ నిలువరించారు. కాకతీయ విశ్వవిద్యాలయలో పీహెచ్‌డీ- 2022లో మిగిలిన సీట్లను కేటగిరి-2లోకి మార్చి రెండో జాబితా ప్రకటించి ఇటీవల ప్రవేశాలు కల్పించారు. అందులో అవకాశం రానివారు ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణను కలిసి విన్నవించుకోగా సానుకూలంగా స్పందించారని, రిజిస్ట్రార్ మల్లారెడ్డి సీట్లు పెంచకుండా అన్యాయం చేస్తున్నారంటూ విద్యార్థులు, విద్యార్థి నాయకులు ఆందోళనకు దిగారు. అప్పట్లో పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలపై పోరాటం చేశామని, ఉద్యమాల సమయంలో ఎంతో నష్టపోయామని అన్నారు. తమకు సీటు ఇచ్చి న్యాయం చేయకపోతే ఎంత వరకైనా పోరాటం చేస్తామన్నారు. వర్సిటీ ప్రిన్సిపల్ సురేష్‌లాల్, డీన్ ఆచార్య మనోహర్, పాలక మండలి సభ్యుడు చిర్ర రాజు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, తిరుపతి, అనిల్ తదితరులు ఉన్నారు.



టవర్ ఎక్కిన వారికి నచ్చజెప్పి కిందకు దించుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్



పురుగు మందు డబ్బాతో వచ్చిన విద్యార్థులను వారిస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి

విద్యుదాఘాతంతో మహిళ మృతి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించి ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది.. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన గంట సుక్కక్క(38) అనే మహిళా రైతు గ్రామ శివారులో పెద్ద చెరువు సమీపంలో రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. కోతులు, పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు గతంలో చేను చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేశారు. అదనంగా కొద్ది నెలల క్రితం సోలార్ కంచె కూడా అమర్చారు. పాత ఇనుప కంచె తీగ ప్రమాదవశాత్తు సోలార్ కంచెను తాకడంతో విద్యుత్ ప్రసరించింది. ఇది తెలియని సుక్కక్క ఉదయం పొలం వద్దకు వెళ్లినప్పుడు సోలార్ కంచెను తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సుక్కక్క(పాత చిత్రం)

బావిలో పడి ఒకరి..

టేకుమట్ల, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురైన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన టేకుమట్ల మండలం ద్వారకపేటలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి భూమిరెడ్డి(41) బుధవారం సాయంత్రం మిరప మొక్కలకు నీటిని తడిపేందుకు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ పని చేయకపోవడంతో మరమ్మతు చేసేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న బావిలో పడ్డాడు. అక్కడే ఉన్న భార్య దేవకి చూసి స్థానికులకు చెప్పగా.. మోటార్ సహాయంతో నీటిని తోడి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



భూమిరెడ్డి (పాత చిత్రం)

ఎరువుల దుకాణం, గోదాం సీజ్

కాటారం, న్యూస్‌టుడే : కల్తీ, కాలం చెల్లిన పురుగు మందుతో పత్తి పంట దెబ్బ తిందని మహాముత్తారం యామన్‌పల్లి గ్రామానికి చెందిన రాజేందర్ ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదుతో వ్యవసాయ అధికారులు గురువారం విచారణ, తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, ఏఈవోలతో గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. కొంతమేర పంట నష్టాన్ని గుర్తించారు. అలాగే పురుగు మందులు విక్రయించిన మండల కేంద్రంలోని క్రాంతికుమార్ ట్రేడర్స్ ఎరువుల దుకాణం, గోదాంను మహాదేవపూర్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీపాల్, ఏవో, ఎస్సై అభినవ్‌తో కలిసి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని సుమారు రూ.1.42 లక్షల పురుగు మందులను గుర్తించినట్లు తెలిపారు. స్టాక్‌కు సంబంధించి రిజిష్టర్లు, బిల్లులు లేకపోవడం, రైతులకు రశీదులు ఇవ్వకపోవడంతో 15 రోజుల పాటు క్రయవిక్రయాలు జరపకుండా దుకాణం, గోదాంను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ఏఈవో రాజన్న ఉన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీపాల్

‘కోలిండియా’ కండల వీరుడు మనోడే!
వరుసగా మూడోసారి స్వర్ణం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ‘మిస్టర్ కోలిండియా’గా ఎంపికై ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు.. కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన రామకృష్ణ. 2022 నుంచి వరుసగా మూడేళ్లలో మిస్టర్ కోలిండియాగా విజయాన్ని అందుకొని సింగరేణి ఉద్యోగిగా ఖ్యాతి దక్కించుకున్నాడు. ఈ ఏడాది జాతీయస్థాయి పోటీలు గతనెల 28న ఒడిశాలో ముగిశాయి. రామకృష్ణ మాట్లాడుతూ.. ‘మాలాంటి యువ క్రీడాకారులకు సింగరేణి మరింత ప్రోత్సాహం, ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే ఏ పోటీల్లోనైనా రాణిస్తాం’ అని అన్నారు. రామకృష్ణ ప్రస్తుతం సత్తుపల్లి జేవీఆర్ ఉపరితల గనిలో అసిస్టెంట్ చైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు.



బొగ్గుబాయి ముచ్చట్లు

రెస్క్యూ పోటీల నిర్వహణపై సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-2 మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో ఈ నెల 16, 17 తేదిల్లో నిర్వహించే 53వ జోనల్ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల నిర్వహణపై గురువారం జీఎం చింతల శ్రీనివాస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పోటీలకు సంస్థ సీఎండీ బలరాం హాజరవుతున్నట్లు తెలిపారు. రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, రెస్క్యూ సూపరిండెంట్ మాధవరావుతోపాటూ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రహదారి సమస్యల పరిశీలన

గోదావరిఖని: ఓసీపీ-5, ఓసీపీ-3 క్వారీల మధ్యనున్న మార్గానికి అధికారులు అనుమతించకపోవడంపై.. కార్మికుల విజ్ఞప్తి మేరకు జీఎం లలిత్‌కుమార్ స్పందించారు. గురువారం ద్విచక్ర వాహనంపై జీడీకే-5 ఓసీపీ పక్కనుంచి జీడీకే-11 గని వరకున్న మార్గాన్ని పరిశీలించారు. రహదారిని వినియోగంలోకి తీసుకువస్తే కార్మికులకు మేలు చేసినట్లవుతుందని వారు జీఎంకు విన్నవించారు. ఆయన వెంట ఓసీపీ-5 మేనేజర్ అనిల్‌గబాలే, ఐఎన్టీయూసీ నాయకులు సదానందం తదితరులున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

చిట్యాల, న్యూస్‌టుడే : దేశంలో మతం పేరుతో రాజకీయం చేస్తూ భాజపా అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలంతా తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు అన్నారు. గురువారం కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామంలో సీపీఎం చిట్యాల మండల మహాసభలను నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చింతల రజినీకాంత్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భాజపా అనుసరిస్తున్న విధానాలతో ప్రజా ప్రయోజనాలకు, దేశ అభివృద్ధికి తీరని నష్టం చేకూరుతోందని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, ఆదివాసీలు, కార్మికులు, పేదలపై అమానుషంగా దాడులు చేస్తున్నట్లు చెప్పారు. యూపీఏ-2 హయాంలో తమ పార్టీ కృషితో ఆటవీకులు చట్టం తీసుకొచ్చి అనేక కుటుంబాలకు పట్టాలు రావడానికి కారణమైందని అన్నారు. కేంద్రంలో భాజపా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆకుదారు రమేష్, కల్పన, భూక్యా నవీన్, వినోద్, రాజమణి, కుమార్, రామచంద్రు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు

హామీల అమలును ప్రశ్నిస్తే కేసులా..?



మాట్లాడుతున్న భాజపా నేత చల్లా నారాయణరెడ్డి

కాటారం, న్యూస్‌టుడే : ఈ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే మంత్రి శ్రీధర్‌బాబు అధికారంతో అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారని భాజపా రాష్ట్ర నేత చల్లా నారాయణ రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో భాజపా నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆబ్కారీ అధికారుల తీరుతో ఆటో డ్రైవర్‌కు అన్యాయం జరిగిందని యూనియన్ సభ్యుల ధర్నాకు మద్దతు తెలిపితే అక్రమ కేసు పెట్టి ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి తన ప్రాంత అభివృద్ధిని విస్మరించారని.. కాటారం, మహదేవపూర్‌లో వంద పడకల పడకల ఆసుపత్రి, ఇతర మండలాల్లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంథని నియోజకవర్గ ప్రక్షాళన చేయాలని, కేసులు పెట్టే సంస్కృతిమాని అభివృద్ధి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, ఇన్‌ఛార్జి సంపత్, భాస్కర్‌రెడ్డి, అర్జయ్య, రాజు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మహదేవపూర్ : దుబ్బగూడెంలో అమ్మవారికి పూజలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని పలు కార్మిక కాలనీల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో, వివిధ బొగ్గు గనుల ప్రాంతాల్లో, కార్మిక కాలనీలు, పలు గ్రామాల్లో నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇప్పటికే ఆలయాలు, ప్రత్యేక మండపాలను రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారి హోమం ఉంటుందని చెప్పారు.



శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిట్యాల : మండల కేంద్రంలోని చింతలపల్లి, నైన్‌పాక, తిరుమలాపూర్, చల్లగరిగె, జడల్‌పేట, గోపాలపురం గ్రామాల్లో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మొకిరాల మధువంశీకృష్ణ నూతన వస్త్రాలను సమర్పించారు. గురువారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను దర్శించుకొని అమ్మవారి అలంకరణకు 10 చీరల చొప్పున నిర్వాహకులకు అందజేశారు. అనంతరం గ్రామంలో రామకృష్ణ పరమహంస ట్రస్ట్ ఆధ్వర్యంలో మధువంశీకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నరేందర్ స్వామి, నక్క భాస్కర్, కంచర్ల రమేష్, సుదగాని ప్రభాకర్, నూక వీరయ్య, యాదండ్ల రాజయ్య, నక్క రవి, చిన్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



నైన్‌పాక గ్రామంలో నూతన వస్త్రాల అందజేత

మహదేవపూర్ : దుబ్బగూడెంలో అమ్మవారిని, టస్సర్‌కాలనీ ప్రాంతంలో గర్భగౌరి సంస్థాన్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. కలశ స్థాపన, గణపతి పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. పండితులు కొమ్మెర శ్రీరాంమ్మూర్తి శర్మ, గంగదేవి ఆలయ అర్చకులు నిశాంత్ పాల్గొన్నారు.

వేగవంతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ 2020లో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు చేసిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎల్ఎఆర్ఎస్ దరఖాస్తుల విచారణ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8,310 మంది ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేయగా 982 దరఖాస్తులు విచారణ పూర్తయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 7,328 దరఖాస్తుల విచారణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● కుక్కల వృద్ధి నియంత్రణ శస్త్రచికిత్స కేంద్రాన్ని సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లిలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను పరిశీలించారు. శస్త్రచికిత్సల అనంతరం కుక్కలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, తదితరులు పాల్గొన్నారు.

● డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల విచారణ ప్రక్రియ ఈనెల 5వ తేదీ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, వానాకాలం ధాన్యం కొనుగోలుపై ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి విద్య, పౌర సరఫరాలు, మార్కెటింగ్, తూనికలు కొలతలు, వ్యవసాయ, సహకార, డీఆర్డీవో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని 5వ తేదీకి ఒకరోజే ఉన్నందున పరిశీలన వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ అధికారి కనుకశేఖర్, పౌరసరఫరాల శాఖ డీఎం రాములు, వ్యవసాయశాఖ అధికారి విజయ్ భాస్కర్, డీఆర్డీవో అవినాశ్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : వయోవృద్ధులు సమాజానికి ఎంతో విలువైనవారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం మహిళా శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, విజ్ఞానం యువతకు మార్గనిర్దేశకమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమాన్ని విస్మరిస్తే చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామని.. ఇబ్బందులకు గురయ్యే వయోవృద్ధులు ఆర్డీవోకు లేదా టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న అమృత వర్షిణి వృద్ధాశ్రమానికి టీవీని బహుకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమాధికారి చిన్నయ్య, డీపీవో నారాయణరావు, అమృత వర్షిణి వయోవృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

సంక్షిప్తంగా

సంప్రదాయాలకు ప్రతీక తీజ్



కొత్తపల్లిగోరి,(రేగొండ),న్యూస్‌టుడే : గిరిజనుల తీజ్ పండగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గిరిజనుల ఆధ్వర్యంలో గురువారం జరిగిన తీజ్ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. యువతులు, మహిళలు చేసిన సంప్రదాయ నృత్యాలను తిలకించారు. నేతలు ప్రభాకర్, కుమారస్వామి, రాజు, రాజేందర్, విజేందర్, సాంబయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భూపాలపల్లి: యోగా సాధనతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని భూపాలపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు ప్రధాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శ్రీ పరివార్ యోగా గురువు యాసోజు మాధవచారి ఆధ్వర్యంలో గురువారం 14 ఏళ్లలోపు బాలబాలికలకు వ్యక్తిత్వ, వికాస నైపుణ్యతపై డాక్టర్ ప్రధాన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా చేయడంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత ఉంటుందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని పేర్కొన్నారు. అనంతరం బాలబాలికలకు రాగి జావతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాధకులు తాగి వెంకన్న, వంశీకృష్ణ, సామంతుల శ్యామ్, సతీష్‌కుమార్, వేశాల రవీందర్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక

రేగొండ: కొడవటంచ గ్రామంలోని గీత కార్మికులు గురువారం సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గైని విజేందర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సంఘం పెద్దలు, సభ్యులు కుమార్‌గౌడ్, కుమారస్వామిగౌడ్, ఒదెలుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్, వెంకన్నగౌడ్ పాలొన్నారు.

మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లింది

మహదేవపూర్: మావోయిస్టుల సిద్ధాంతాలకు కాలం చెల్లిందని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు సహకరించినా, పాల్పడినా చట్టపరంగా చర్యలు తప్పవని మహదేవపూర్ ఎస్సై కె.పవన్‌కుమార్ పేర్కొన్నారు. రాపెల్లికోటలో గురువారం ఇంటింటి సోదాలు నిర్వహించారు. ఎవరైనా అనుమానిత, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా, గుట్కా, మాదక ద్రవ్యాల వాడకం, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. కాళేశ్వరం ఎస్సై చక్రపాణి పాల్గొన్నారు.

గీతపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

గణపురం: గణపురం గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మాదాసు రవి, ఉపాధ్యక్షుడిగా మండల రవి కుమార్, కార్యవర్గ సభ్యులుగా పల్లె రమేశ్, సదయ్య, పోశాల రాజయ్య, రావుల అశోక్, ఆరెల్లి కుమార్, మొగిలిపాక శ్రీనివాసులు, మాదాసు అర్జున్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు మార్క కుమార్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని రావిచెట్టు బస్టాప్ వద్ద గురువారం గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . మండల కేంద్రానికి చెందిన బండారి వినయ్ అనే యువకుడు హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోలు గ్రామం నుంచి 220 గ్రాముల గంజాయి తీసుకొని ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మొగుళ్లపల్లి రావిచెట్టు బస్టాప్ వద్ద బస్సు తనిఖీ చేసి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. గంజాయి విలువ సుమారుగా రూ. 5000లు ఉంటుందన్నారు.

గీతకార్మికుడి ఆత్మహత్య

మొగుళ్లపల్లి : పురుగు మందు తాగి గీత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెద్దకోమటిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గడ్డం చిన్నకొమురయ్య(52) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లారు. ఎంతకూ తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన పశువుల కొట్టంలో పురుగు మందు తాగి పడిపోయి కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



కొమురయ్య(పాత చిత్రం)

‘వేలం నిర్వహించకుండా కుమ్మక్కు’



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య

భూపాలపల్లి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలో వారాంతపు సంత(అంగడి) బహిరంగ వేలం నిర్వహించాలని ఎమ్మార్పీఎస్(టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధిలో జంగేడు, భూపాలపల్లి, కాశీంపల్లి వారాంతపు సంతలతో పాటు గంపచిట్టీ వసూలు కోసం వేలం నిర్వహిస్తే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మకై ఒకే గుత్తేదారుకు తక్కువ ధరకు కేటాయించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. గంప చిట్టీ కోసం వేలానికి కూడా కొందరు అడ్డుపడుతున్నట్లు తెలిసిందన్నారు. కలెక్టర్ స్పందించాలని కోరారు. చిరు వ్యాపారులకు కనీస వసతులు కల్పించాలని అన్నారు. ఆయన వెంట నాయకులు దేవరాజ్, మహేష్, చిరంజీవి, హరీష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి’

భూపాలపల్లి, న్యూస్‌టుడే : తెలంగాణ విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుతోనే కొనసాగించాలని ఆర్య వైశ్య సంఘం భూపాలపల్లి అర్బన్ కమిటీ అధ్యక్షుడు పాలవరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు పేరు తొలగించి, సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక ఉప తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

22వ వార్డులో డిజిటల్ సర్వే



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని 22వ వార్డు, లక్ష్మీనగర్‌కాలనీలో గురువారం అధికారులు ప్రయోగాత్మకంగా డిజిటల్ కార్డుల జారీకి సర్వే నిర్వహించారు. ప్రతి నియోజకవర్గానికి రెండు ప్రాంతాల్లో ఈ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. స్థానిక తహసీల్దారు శ్రీనివాసులు, మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్వర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, ఎస్.రామస్వామి తదితర సిబ్బంది కలిసి 22వ వార్డుల్లో ఇంటింటా తిరిగి సర్వే చేపట్టారు. కాలనీలో సర్వే రికార్డుల ప్రకారం 198 ఇళ్లు మాత్రమే ఉన్నాయని, మిగతా ఇళ్లకు సంబంధించిన కుటుంబ సభ్యుల పేర్లు, ఎంత మంది నివాసం ఉంటున్నారు.. వారి సెల్‌ఫోన్, ఆధార్ కార్డు నంబర్‌లతో పాటు చిరునామా సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్వేకు 22వ వార్డు ప్రజలు సహకరించాలని కోరారు. స్థానిక వార్డు కౌన్సిలర్ ముంజాల రవీందర్, మున్సిపాలిటీ, రెవెన్యూ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.